మార్గదర్శిగా కలెక్టర్



దత్తత తీసుకున్న కుటుంబాలతో కలెక్టర్ వెంకటేశ్వర్

● ఐదు బంగారు కుటుంబాల దత్తత

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్రజ్యోతి): ఐదు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ 'మార్గదర్శి'గా మారారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం కింద జిల్లాలో సామాజిక అభివృద్ధికి దోహదపడేలా, అందరికీ ఆదర్శప్రాయంగా మొదటగా ఐదు బంగారు కుటుంబాలను శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ దత్తత తీసుకున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలోని నక్కల కాలనీకి చెందిన నాలుగు, దామినేడుకు చెందిన ఓ కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాల్లో పునాదులు ఏర్పడేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ కుటుంబాల సంక్షేమం కోసం వ్యక్తిగతంగానే కాకుండా జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల సహకారం, సమన్వయంతో సాయం అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులకు, సమాజ సేవకులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుంటే గ్రామీణాభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందని కలెక్టర్ తెలిపారు.

దత్తత తీసుకున్న కుటుంబాలు:
షికారీ కాలనీకి చెందిన సావిత్రమ్మ, వేదవల్లి, అంబికా, బలరాం, దామినేడుకు చెందిన విజయశాంతి కుటుంబాలు.



రెండో శనివారం, ఆదివారం. ఈ రెండు రోజుల వరుస సెలవులతో గురువారం సాయంత్రం నుంచే తిరుమలకు భక్తుల రాక పెరిగింది. శుక్రవారం నాటికి రద్దీ మరింత పెరిగి.. స్వామి దర్శనం కోసం కిలోమీటర్ల కొద్దీ క్యూలలో భక్తులు వేచి ఉన్నారు. వీరికి దాదాపు 16 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న వారికీ మూడు నుంచి నాలుగు గంటల తర్వాతే స్వామి దర్శనం లభిస్తోంది. ఈ రద్దీ ప్రభావం గదులపైనా పడింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రైతుల పక్షాన తాము నిలబడుతున్నామని, చంద్రబాబు ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని వైసీపీ అధ్యక్షుడు జగన్ ప్రకటించడం, శుక్రవారం సాక్షి ప్రధాన పత్రికలో ఆయన కొన్ని ప్రశ్నల్ని అడగడంపై జిల్లా రైతుల్లో చర్చ నడుస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం అడక్కముందే రైతులకు రూ.4 సబ్సిడీ ఇచ్చి ఆదుకుంటుంటే, ఐదేళ్లలో ఏనాడూ నయా పైసా ఇవ్వని జగన్ అబద్ధాలను వల్లె వేయడంపై అన్నదాతల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. జగన్ పలుకుల్లో వాస్తవాల గురించి చర్చించుకుంటే..

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఐదేళ్లలో మామిడి రైతులకు ఎంతిచ్చావ్ జగన్?





- గతేడాది రూ.29 ఇచ్చింది నువ్వా.. ఫ్యాక్టరీలా?
- గతేడాది 1.7 లక్షల టన్నుల దిగుబడితో డిమాండ్
- ఈసారి 5 లక్షల టన్నుల దిగుబడితో ధరల పతనం

జగన్: ఏటా మే 10-15 మధ్య తెరవాల్సిన పల్ప్ ఫ్యాక్టరీలు ఈ ఏడాది ఎందుకు ఆలస్యంగా తెరిచారు?

వాస్తవం: ఈసారి వర్షాలు అధికంగా పడడంతో కాయలు ఆలస్యంగా పక్వానికి వచ్చాయి. పక్వానికి రాని కాయల్లో తియ్యదనం ఉండదు. తియ్యదనం లేకుండా ఫ్యాక్టరీలు కొనుగోలు చేయవు. అందుకే జిల్లాలోని ఫ్యాక్టరీలు పక్వానికి వచ్చాక జూన్‌లో తెరచుకున్నాయి.

జగన్: మీ గల్లా ఫ్యాక్టరీ, శ్రీని ఫుడ్స్. ఇలా మీ వాళ్లకు మేలు చేయాలన్న ఉద్దేశంతోనే ఇదంతా చేయడం లేదంటారా?

వాస్తవం: అసలు ఈసారి శ్రీని ఫుడ్స్ ఫ్యాక్టరీ పనిచేయలేదు. గల్లా ఫ్యాక్టరీ జిల్లాలోనే అత్యధికంగా రైతులకు రూ.6 ఇస్తోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ ఫ్యాక్టరీ రూ.4 మాత్రమే ఇస్తోంది. అందులోనూ తమ పార్టీ సానుభూతిపరులైన రైతుల నుంచే కొంటున్నారు. ఇప్పటికి 8 వేల టన్నులే సేకరించారు. అలాగే వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న ర్యాంపుల్లో రూ.2 మాత్రమే ఇస్తున్నారు.

జగన్: వైసీపీ పాలనలో మేం కిలోకు రూ.29 ఇస్తే.. ఇప్పుడు రూ.రెండున్నర నుంచి రూ.మూడు ఇస్తారా?

వాస్తవం: గతేడాది రూ.29 చొప్పున కొనుగోలు చేసింది ప్రభుత్వం కాదు, ఫ్యాక్టరీలు. అప్పుడు డిమాండ్ ఉండడంతో కొన్నారు. గతేడాది 1.7 లక్షల టన్నుల దిగుబడి మాత్రమే రావడంతో ఫ్యాక్టరీలు కొన్నాయి. ఈసారి చిత్తూరు జిల్లాలో మాత్రమే 5 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఇలాగే 2023లో అధిక దిగుబడి వచ్చి ధర పతనమైపోయింది.అప్పట్లో జగన్ ప్రభుత్వం రైతుల్ని ఆదుకోలేదు.

జగన్: ఇప్పటివరకు రూ.4 సబ్సిడీ ఎంత మంది రైతులకు అందించారు? రూ.8 చొప్పున ఎంత మందికి ఫ్యాక్టరీలు చెల్లించాయి?

వాస్తవం: ఇప్పటివరకు జిల్లాలో 40,977 మంది రైతుల నుంచి 2,85,695 టన్నుల మామిడిని కొనుగోలు చేశారు. ఇంకా సేకరణ జరుగుతోంది. రెండు వారాల్లో పూర్తవుతుంది. ఆయా ఫ్యాక్టరీల వద్ద ప్రభుత్వ ఉద్యోగుల బృందం రైతుల నుంచీ బ్యాంకు అకౌంట్ వంటి వివరాలు సేకరిస్తోంది. తాజాగా రూ.260 కోట్ల సబ్సిడీ విడుదల చేస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. రైతుల ఖాతాల్లో ఒకేసారి నిధులు జమ కానున్నాయి. జిల్లాలో ఫ్యాక్టరీలు కిలోకు రూ.6 అందిస్తున్నాయి. అక్కడక్కడ కొన్ని మాత్రమే రూ.5 ఇస్తున్నాయి. ప్రతీసారిలాగే ఒకేసారి బిల్లుల్ని రైతులకు అందిస్తాయి.

జగన్: ఇక్కడ రూ.12 మద్దతు ధర అమలు కావడం లేదు. అదే పొరుగు రాష్ట్రం కర్ణాటకలో కుమారస్వామి కేంద్రానికి లేఖ రాస్తే రూ.16 చొప్పున కొంటున్నారు.

వాస్తవం: కర్ణాటకలో రూ.16 చొప్పున కాయల్ని కొనడం లేదు. అది మద్దతు ధర మాత్రమే. అక్కడ అనేక ఆంక్షలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.4 ఇస్తున్నాయి. కర్ణాటకలో రైతుకు గరిష్ఠంగా రూ.40 వేలు అందితే, ఇక్కడ గరిష్ఠం లేదు. రూ.2 లక్షలు అందినవారూ ఉన్నారు.

'మఠం', కాలువ భూముల్లో నిర్మాణాలు

- తొలగింపజేసిన అధికారులు
- అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు పెడతామన్న కలెక్టర్
- అధికారులను అడ్డుకున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు

మితిమీరిన వేగం

- బైకును ఢీకొని బోల్తాపడిన మినీలారీ
- ద్విచక్ర వాహనదారుడి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

విద్యా సంస్థల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కొరడా

- విస్తృతంగా పోలీసుల తనిఖీలు

వివరాలు 8వ పేజీలో

డీటీ లేరని.. కౌన్సెలింగ్ ఆగుతుందా?

● ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇక్కట్లు

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఈఏపీ సెట్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజుల గడువుంది. డీటీ లేరని శ్రీకాళహస్తిలో ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీ చేయడంలేదు. ఆయన సెలవులో ఉన్నారని, తమ కౌన్సెలింగ్ తేది ఆగుతుందా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. సమయానికి సర్టిఫికెట్లు పొందే విషయంలో టెన్షన్ పడుతున్నారు. ప్రస్తుతం ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరేందుకు కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. దీనికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జత చేయాలి. మరో మూడురోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయంలో ఆదాయ ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ చేతికి అందక కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు వాపోతున్నారు. ఈ నెల 4న దరఖాస్తు చేసుకున్న కొందరు శుక్రవారం నాటికి కూడా ఇన్‌కం సర్టిఫికెట్ రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దారు జనార్దన్‌రాజును వివరణ కోరగా, డీటీ జగన్ సెలవులో ఉండటంతో ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీలో కొంతజాప్యం జరిగిందన్నారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి అధికారిని నియమించకపోవడాన్ని ప్రస్తావించగా, డిజిటల్ కీ లాగిన్‌ను ఇన్‌ఛార్జి అధికారి తెరిచే అవకాశం లేకపోవడంతో బాధ్యతలు అప్పగించలేదన్నారు. అందరికీ సోమవారం ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బయోటెక్నాలజీతో జంతువులకు మెరుగైన ఆరోగ్యం

● వెటర్నరీ వర్సిటీతో ఎన్ఐఏబీ ఒప్పందం



ఎంవోయూ పత్రాలు చూపుతున్న వీసీ జేవీరమణ, ఎన్ఐఏబీ డైరెక్టర్ తారుశర్మ

తిరుపతిరూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, హైదరాబాద్‌కి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) సంస్థల మధ్య విద్య, పరిశోధనాంశాల్లో పరస్పర సహకారం కోసం అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు శుక్రవారం వర్సిటీ పరిపాలనాభవనంలోని సమావేశ మందిరంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, అధికారుల సమక్షంలో ఎన్ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ జి.తారుశర్మ ఈ ఒప్పంద పత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జేవీ రమణ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న బయోటెక్నాలజీని ఉపయోగించుకుని జంతువుల ఆరోగ్యం, ఉత్పాదకత మెరుగుపరచుకోవడం, అధునాతన పరిశోధనల కోసం ఈ ఎంవోయూను కుదుర్చుకున్నామన్నారు. రిజిస్ట్రార్ రవికుమార్, డీన్ వీరబ్రహ్మయ్య, డీఆర్ సీహెచ్ శ్రీలత, సీవోఈ చెంగల్వరాయులు, డెయిరీ డీన్ నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు రాణీ ప్రమీల, శ్రీదేవి, సూర్యనారాయణ, సురేష్, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

తిరుపతి(క్రీడలు), జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య కూడలి సమీపంలోని గిరిజన భవన్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు 5వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖారాణి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి అండర్ 11, 13, 15, 17లలో దాదాపు 250మంది బాలబాలికల ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 26నుంచి 29వరకు బిలాస్‌పూర్(ఛతీస్‌గడ్)లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 35 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 35 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురు పట్టుబడగా అందులో అధిక మొత్తంలో మద్యం తాగిన 35 మందిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వీరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

టీడీపీ పాలనలోనే అభివృద్ధి



నెత్తకుప్పంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జేడీ జగన్ అన్నారు. మండలంలోని నెత్తకుప్పం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. జగన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బటన్ నొక్కినా ఎవరికీ పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందలేదన్నారు. దివాలా తీసిన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, మురళీమోహన్, రెడ్డెప్పరెడ్డి, ఆర్ గిరినాయుడు, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భీష్మ ప్రతిజ్ఞ



నాటక ఘట్టాలను వివరిస్తున్న భాగవతారిణి

రామచంద్రాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారణి అనసూయ చేసిన భీష్మ ప్రతిజ్ఞ సభికులను ఆకట్టుకుంది. తన తండ్రి శంతన మహారాజుకు, సత్యవతిదేవికి పెళ్లి చేయడానికి తాను అజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటానని భీష్ముడు ప్రతిజ్ఞ చేసిన ఘట్టాలను ఆమె రమ్యంగా వినిపించారు. ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామికి తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల నడుమ ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి మంగళహారతులు అందించి, మొక్కులు తీర్చుకున్నారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి



విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేస్తున్న నిరంజన్‌బాబు

రామచంద్రాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నైపుణ్యతలను పెంచుకోవాలని జేఎన్‌టీయూ - అయిల్ టెక్నాలజికల్ ఫార్మస్యూటికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రామాపురం గ్రామంలో ఉన్న సెవెల్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం 4వ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యతో పాటు వృత్తి నైపుణ్యతను మెరుగుపరచుకోవాలన్నారు. మైథిలి లైఫ్ సైన్సెస్ ఎండీ గోపినాథరెడ్డి మాట్లాడుతూ నైపుణ్యం ఉంటే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నిరంజనబాబు మాట్లాడారు. అనంతరం బీ.ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విభాగాధిపతులు, డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, పరీక్షల నియంత్రణ అధికారి స తీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన ఆర్ఎం



బస్టాండ్‌లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఆర్ఎం జగదీష్

పాకాల, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం తిరుపతి రీజినల్ మేనేజర్ ఎం.జగదీష్, తిరుపతి డీఎంటీ బాలాజీ సందర్శించారు. అక్కడ ప్రయాణీకులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించాలని వ్యాపారులకు సూచించారు. అతిక్రమిస్తే నోటీసులు ఇచ్చి లైసెన్సులు రద్దు చేయాలని డీఎంకు సూచించారు. నిషేధిత వస్తువులు విక్రయించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ రవిచంద్ర పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం



తిరుచానూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ అమ్మవారికి శుక్రవారం తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని సుప్రభాతసేవతో అర్చకులు మేల్కొపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేకం చేశారు. ఉదయం లక్ష్మీపూజ, కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అలంకార శోభితురాలైన పద్మావతీదేవిని బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి తీరుమాడ వీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో యనమల



తిరుచానూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుచా నూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం రాత్రి టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ హరీందర్‌నాథ్, సూపరిం టెండెంట్ రమేష్ వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజ స్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రగిరి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



భాకరాపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లులో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి నరేంద్ర హాస్పిటల్ వైద్యులతో సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. 68 మంది హాజరు కాగా పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మంగళం క్వార్టర్స్‌ను అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మంగళం క్వార్టర్స్‌ను మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మంగళం క్వార్టర్స్‌లోని పద్మావతీపురం గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వృద్ధులను, మహిళలను పలకరించి పింఛన్, రేషన్, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాల అమలు గురించి ఆరా తీశారు. పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు కానుందని తెలిపారు. మంగళంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాత్రి బీటీఆర్ పురంలో కార్యక్రమాన్ని ముగించారు. టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, సురేష్‌నాయుడు, గోపినాథ్, మహేశ్వరి, జానకి, పెరుగు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసుల యాదవ్, రవిచంద్ర, రామకృష్ణ, బుజ్జి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి అభివృద్ధి పనులను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఉపాధి కల్పనే ధ్యేయంగా ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం అమలు

● పీఎఫ్ కమిషనరు కుమార్ వెల్లడి



తిరుపతి(నేరవిభాగం), జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం ద్వారా అన్ని రంగాల్లో ఉపాధి కల్పన మెరుగు పడుతుందని పీఎఫ్ కమీషనర్ కుమార్ వెల్లడించారు. తిరుపతిలోని ప్రాంతీయ భవిష్య నిధి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద మొదటి సారి ఉద్యోగంలో చేరిన వారికి ఒక నెల వేతనం రూ 15,000 వరకు ప్రోత్సాహకంగా నగదు అందచేస్తారన్నారు. అన్ని రంగాల్లోని యాజమాన్యాలకు రెండేళ్ళ పాటు అవసరమైన ప్రోత్సాహకాలు అందచేస్తామని చెప్పారు. ఈఎల్ఐ పథకం ద్వారా రూ.99,446 కోట్లు వ్యయంతో దేశంలో రెండేళ్ళ కాలంలో 3.5 కోట్లు మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రోత్సాహకాలు అందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 మధ్య కాలంలో కల్పించిన ఉద్యోగాలకు ఈ పథకం ప్రయోజనాలు వర్తిస్తాయని చెప్పారు. మొదటి సారిగా ఈపీఎఫ్‌లో నమోదు చేసుకున్న ఉద్యోగులు, రూ.లక్ష వరకు వేతనం పొందే ఉద్యోగులు దీనికి అర్హులని ప్రకటించారు. పొదుపు అలవాటును ప్రోత్సహించేందుకు వారికి అందించే ప్రోత్సాహకంలో కొంత మొత్తాన్ని డిపాజిట్ చేస్తారని తెలిపారు. ప్రధానంగా తయారీ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. ఇందులో ఉద్యోగ కల్పనకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

తిరుపతి(ఆటోనగర్), జూలై11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి పార్టీలు.. అధికారంలోకి వచ్చిన వెంటనే రకరకాల పేర్లుతో రూ15 వేల కోట్లు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. అంతటితో ఆగక నివాసగృహాలకు అదాని స్మార్ట్ మీటర్లు అమర్చి అదనంగా భారం మోపుతుందని ఆమె విమర్శించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడంతో తగిన మూల్యం చెల్లించుకుందన్న విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించుకోవాలని ఆమె హెచ్చరించారు. జిల్లాలో స్మార్ట్ మీటరు అమర్చడానికి వస్తే ప్రజలు అడ్డుకోవాలన్నారు. ఈ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. అదానీ సకీ సోలార్ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం. రమేష్, జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు విద్యను దూరం చేయడానికే ప్రభుత్వ పాఠశాలలను మూతవేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు పి.పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, జనార్ధన్, జయచంద్ర, పి.సాయిలక్ష్మి, వేణుగోపాల్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ, ఆర్థిక సంఘ నిధులతో పనులు పూర్తి చేయండి

అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు, సిమెంటు రోడ్లు, మురుగు నీటి కాల్వలకు సంబంధించి పనులు మంజూరు చేశామన్నారు. పురోగతిలోని పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులను రద్దు చేయాలని ఆదేశాలిచ్చారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. తాగునీరు, డ్రైనేజీలకు సంబంధించి రూ.5లక్షల్లోపు పనులు రెండు వారాల్లో పూర్తవ్వాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్‌రావులు సమయన్వయం చేసుకుని పనులన్నీ పూర్తయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు.. వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి పైపుల్లోకి మురుగు కలవకుండా అవసరమైన చోట్ల మరమ్మతులు చేయాలన్నారు.

విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్‌వాసి మృతి

నాయుడుపేట టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్‌వాసి పాశ్వాన్(27) మృతి చెందినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పాశ్వాన్ కొంత కాలంగా మేనకూరు పారిశ్రామికవాడలోని ఓ కర్మాగారంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన గదిలో ఇనుప కొక్కికి దుస్తులు తగిలిస్తుండగా విద్యుదాఘాతం జరగడంతో పాశ్వాన్ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. అతని సోదరుడు రోహిత్ హుటాహుటిన మేనకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే పాశ్వాన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వాచ్‌మ్యాన్ మృతి

ఓజిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాజుపాళెం గిరిజన కాలనీకి చెందిన మేకల మస్తానయ్య(50) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన సమాచారం మేరకు... మస్తానయ్య రాజుపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు సంస్థలో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన మస్తానయ్యను నెల్లూరులోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంగళ, గురువారాల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలోని గుమ్మిడిపూడి కవర్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ, పట్టాల మార్పిడి వంటి పనులు జరుగుతునందున మంగళవారం(15వ తేదీ), గురువారం(17వ తేదీ) పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దు చేసిన రైళ్ల వివరాలు...

● సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 7.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66035. ● నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20గంటలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66036.● చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40, 8.35, 10.15, మధ్యాహ్నం 12.10కువచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు. ● సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 10.00, 11.45, మధ్యాహ్నం 12.35, 1.15కువచ్చేఈఎంయూ లోకల్ రైళ్లు. ● చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8.05, 9.00, 9.30, 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు. ● గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 9.10, 9.55, 10.55, 11.25, మధ్యాహ్నం 12.00, 1.00, 2.30 వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.

● ఆవడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 4.25కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లను రద్దు చేశారు. అలాగే చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబ్రం మధ్య నడిచే ఈఎంయూ లోకల్ రైళ్ల పాక్షికంగా రద్దు కాగా, మరి కొన్ని రైళ్లు చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరి, మీజూరు వరకు నడపనున్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

చిత్తూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్



చిత్తూరులోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఫొటోగ్రాఫర్లు

చిత్తూరు సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి సీనియర్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి హేయమైన చర్య అని చిత్తూరు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ (సీపీవీఏ) సభ్యులు అన్నారు. శివకుమార్‌పై దాడిని ఖండిస్తూ శుక్రవారం స్థానిక గాంధీ విగ్రహం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. బంగారుపాళ్యంలో మాజీ సీఎం జగన్ రెడ్డి పర్యటనలో ఫొటోలు తీస్తున్న శివకుమార్‌పై అల్లరి మూకలు దాడిచేయడం దారుణమన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా, జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీవీఏ గౌరవాధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షులు ప్రకాష్, దొరై, కార్యదర్శి శంకర్, కోశాధికారి లోకనాథ్, సభ్యులు పవన్, విజయ్‌కుమార్, నాజ, ప్రసాద్, హరి, దేవ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

● పరారీలో ప్రధాన నిందితుడు ప్రకాష్‌ఆచారి
● గాలిస్తున్న ప్రత్యేక బృందాలు

చిత్తూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం జగన్ పర్యటనలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు. శివకుమార్‌ను బంగారుపాళ్యం పోలీసులు గురువారం మరోసారి విచారించారు. కేసులో ఏ1 నిందితుడు, వి.కోటకు చెందిన ప్రకాష్‌ఆచారి పరారీలో ఉండడంతో పోలీసుబృందం గాలిస్తోంది. ఇతను పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడకు అనుచరుడిగా ఉన్నాడు. ఇతను కాకుండా మరో ముగ్గురు పోలీసుల అదుపులో ఉన్నారు.వైసీపీ నేతలు విజయానందరెడ్డి ప్రధాన అనుచరుడు చక్రి,నారాయణస్వామి అనుచరులు జీడీనెల్లూరుకు చెందిన వినోద్, మోహన్ అదుపులో ఉన్నారు.

ఫొటోలో ఉన్నవారి గురించి ఆరా..

వీరితో పాటు వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లెకు చెందిన పి.ఉమాచంద్రరెడ్డి కూడా ఫొటోగ్రాఫర్‌ను కొడుతున్నప్పుడు ఎంకరేజ్ చేశాడని పోలీసులు గుర్తించారు. ఇతను వెదురుకుప్పం వైసీపీ మండల రైతు విభాగ అధ్యక్షుడిగా ఉన్నారు. అలాగే జీడీనెల్లూరు హరిజనవాడకు చెందిన మాజీ వలంటీర్ మదన్ కూడా ఫొటోలో ఉన్నారు. పెద్దపంజాణి మండలానికి చెందిన ఆర్.సతీష్‌రెడ్డి కూడా ఫొటోలో ఉండగా.. వీరి పాత్రపై పోలీసులు విచారిస్తున్నారు.కాగా, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ శివకుమార్ ఆరోగ్యం మెరుగైంది. శనివారం డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డితో పాటు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ప్రభుత్వం తరపున శివకుమార్‌ను పరామర్శించనున్నారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా



నిందితుడు చంద్రశేఖర్

చిత్తూరు లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం సుభాష్ రోడ్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్.. మదనపల్లె బాలికల హైస్కూల్ వద్ద విద్యార్థినులను చూసి మూత్ర విసర్జన చేయడం, వారితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో హెచ్ఎం పద్మజ ఇచ్చిన ఫిర్యాదుతో 2017 మార్చి 8వతేదీన మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసు శుక్రవారం చిత్తూరు పోక్సో కోర్టులో వాయిదాకు రాగా, న్యాయమూర్తి శంకర్‌రావు పూర్వాపరాలను పరిశీలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ మోహనకుమారి వాదించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చంద్రగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ చిన్నరెడ్డప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం కావడంతో రెండు మండలాల పరిధిలో పలు మరమ్మతులు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా వనమహోత్సవం



పర్యావరణ పరిరక్షణ ప్లకార్డులతో విద్యార్థులు

తిరుపతి(విద్య), జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక టాటానగర్ నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రంజిత్‌గుప్త పర్యవేక్షణలో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తూ ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్ విద్యార్థులను అభినందించారు.

గంగమ్మకు సారె సమర్పణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మకు కస్పా పద్మనాభన్-సామ్రాజ్యం దంపతులు కుంకుమ, పసుపు, సారె సమర్పించారు. మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి పురోహితులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, కేఎన్ రాజా, అన్నారెడ్డి రాజశేఖరరెడ్డి, రాంప్రసాద్, కొట్టె సుబ్రమణ్యం, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన పెంచుకోవాలి



వాకర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 11(ఆంధ్రజ్యోతి): వాకర్లు, వృద్ధులు, మహిళలు మత్తు పదార్థాలపై అవగాహన పెంచుకోవాలని తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జగ్జీవన్‌రావ్ పార్కులో వాకర్లకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందచేస్తున్న కృష్ణప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), జూలై11: లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి వారు పేద విద్యార్థికి శుక్రవారం ఆర్థిక సాయం అందించినట్లు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. అనంతవీధికి చెందిన పేద విద్యార్థి రాము ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కళాశాలలో చేరేందుకు ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకుని అతని తల్లిని పిలిపించి రూ.20 వేలు నగదు అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జగన్నాథం, శాంతినాడార్, ఎ.వెంకటేష్, ఈశ్వర్‌రెడ్డి, ఎ.వరప్రసాద్, శేషాద్రి, హరినాథ్, సురేష్, ఎ.మురళి పాల్గొన్నారు.

మర్చిపోయిన బంగారు ఆభరణాల అప్పగింత





బ్రహ్మంకు బంగారు చైన్ అందజేస్తున్న సిబ్బంది - సుధాకర్‌కు ఉంగరాన్ని అందజేస్తున్న సిబ్బంది

తిరుమల, జూలై11(ఆంధ్రజ్యోతి): భక్తులు గదుల్లో మర్చిపోయిన బంగారు ఆభరణాలను టీటీడీ సిబ్బంది తిరిగి భక్తులకు అప్పగించారు. విజయనగరానికి చెందిన బ్రహ్మం అనే భక్తుడు రాంభగీచ-1లో 46 గ్రాముల బంగారు డాలర్‌తో కూడిన చైన్‌ను మర్చిపోయారు. దీన్ని గుర్తించిన సిబ్బంది అధికారులు మేనేజర్ కామరాజు, సురేష్ ద్వారా భక్తుడికి తిరిగి అప్పగించారు. అలాగే పల్నాడు జిల్లావాసి సుధాకర్ వకుళమాత విశ్రాంతి భవనంలో 5 గ్రాముల బంగారు ఉంగరాన్ని మర్చిపోగా సిబ్బంది శ్రీరామ్, శ్రీనివాసులు, రవి, మురళి తిరిగి అందజేశారు.

గడపగడపకూ సంక్షేమం

● 'సుపరిపాలనలో తొలి అడుగు'లో సుగుణమ్మ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుగుణమ్మ, నరసింహ యాదవ్, భట్టే కీర్తి

తిరుపతి, జూలై11(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాదిపాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం తొలి అడుగు కార్యక్రమం స్థానిక 38వ డివిజన్‌లోని సింగాలగుంటలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ వెళ్లి వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, మహిళా యువ నాయకురాలు భట్టే వెంకటకీర్తి, నాయకులు కరణం సందీప్, రేవతి, సంతోష్, విశ్వనాథం, శ్రీనివాసులు, హేమలత, లక్ష్మి, ఉమా, గౌరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొళాయి ప్రారంభం



కొళాయిని ప్రారంభిస్తున్న ఏటీఎం భాస్కర్

తిరుపతి(ఆర్టీసీ), జూలై 11(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులోని పల్లెవెలుగు స్టాండు వద్ద తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ స్టాండు వద్ద తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కొన్ని రోజులుగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు కూడా వచ్చాయి. స్పందించిన అధికారులు ప్రత్యేక కొళాయి ఏర్పాటు చేసి, శుక్రవారం బస్టాండు ఏటీఎం భాస్కర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అసిస్టెంట్ మేనేజర్ సంధ్య, సూపర్‌వైజర్ ఈఆర్.కుమార్ పాల్గొన్నారు.

20న ఓపెన్ చెస్ టోర్నమెంట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి(క్రీడలు), జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ మెడికల్ కాలేజీలో ఈనెల 20వ తేదీన ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను తుడా ఛైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్స్ దివాకర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాలాజీచౌదరి, శ్రీనివాసమూరి, వెంకట్, అనిల్ పాల్గొన్నారు.

నేడు వేద వర్సిటీ ఆవిర్భావ దినోత్సవం

- కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయం 20వ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 7:30 గంటలకు సుదర్శన సహిత పారమాత్మిక హోమం చేపట్టనున్నారు. అనంతరం చేపట్టే సభలో కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి పాల్గొంటారు. అతిథులుగా గ్రీనింగ్-బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఊకా విజయకుమార్, టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు వి. శంకరనారాయణ పాల్గొంటారు. వీసీ రాణీసదాశివమూర్తి అధ్యక్షత వహిస్తారు.

నవోదయ ప్రవేశ పరీక్షపై రేపు అవగాహన

తిరుపతి(విద్య), జూలై 11(ఆంధ్రజ్యోతి): వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఆదివారం ఉదయం 10 గంటలకు నవోదయ ప్రవేశ పరీక్షపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. 4 నుంచి 9వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802/03, 9399976999లలో సంప్రదించవచ్చని సూచించారు.

ఘనంగా కేంద్రమంత్రి జన్మదిన వేడుకలు



బండి సంజయ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. అలిపిరి పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ హోటల్లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన వేడుకలకు మంత్రి సంజయ్ హాజరయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్ ఆయన్ను దుశ్శాలువలు, పూలమాలలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాటకొండ విశ్వనాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహనకే ఈగల్ టీంలు



పోలీసులతో ఈగల్ టీం సభ్యులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడానికి ప్రతి పాఠశాలలోనూ ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అలిపిరి సీఐ రాంకిషోర్ చెప్పారు. శుక్రవారం అకార్డు పాఠశాలలో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల ప్రభావం యువతపై ఎక్కువగా ఉందన్నారు. వాటికి బానిసలు కావడం ఎంత ప్రమాదమో వివరించారు. అనంతరం విద్యార్థుల నుంచి యాంటీ నార్కోటిక్ ప్రమాణం తీసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సత్యలక్ష్మి మాట్లాడారు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ఉచిత అంబులెన్సుల ప్రారంభం

రాజాష్ ఆచారి, జేఎంసీ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి తదితరులు

తిరుపతి(వైద్యం), జూలై 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నాలుగు ఉచిత అంబులెన్స్‌లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం శ్రీపద్మావతి వైద్య కళాశాల ఆవరణలో ప్రారంభించారు. రాజాష్ ఆచారి, జేఎంసీ ట్రస్టు ఆధ్వర్యం లో ఈ అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యం కోసం స్విమ్స్‌కు వచ్చే రోగులు అత్యవసర సమయంలో అంబులెన్స్‌లకు డబ్బు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏర్పాటు చేశామని వివరించారు. ఈ అంబులెన్సులకు అద్దె చెల్లించాల్సిన పనిలేదని, కేవలం డీజిల్, డ్రైవరు బత్తా ఇస్తే సరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు రాజారెడ్డి, బాలిశెట్టి కిషోర్, వేణుగోపాల్, శివ, మురళి పాల్గొన్నారు.

జనాభా నియంత్రణలో మగవారి పాత్ర కీలకం



జనాభా నియంత్రణ గురించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), జూలై 11(ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణలో మగవారి పాత్ర కీలకమని, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు పురుషులు కూడా ముందుకు రావాల్సిన అవసరముందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన కలిగే అనర్థాలు, ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను వివరించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు సెల్వియా, శ్రీనివాసులరెడ్డి, హరిత, డీఐవో చత్రప్రకాష్ రెడ్డి, మలేరియా అధికారి రూప్‌కుమార్, వైద్యాధికారులు నాగేంద్రకుమార్, కిరణ్‌కుమార్, ఖాజావలి పాల్గొన్నారు.

నేడు శ్రీమద్భగవద్గీత గజల్ గానం

గజల్ శ్రీనివాస్ రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీమద్భగవద్గీత గజల్ గానం శనివారం తిరుపతిలో నిర్వహించనున్నారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం 5:30 గంటలకు కచ్చపి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. శ్రీమద్భగవద్గీత గజల్ గానాన్ని ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ చేయనున్నారు. అలాగే ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల ఆధ్వర్యంలో 'అష్టలక్ష్మీ వైభవం' నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారు. అనంతరం చేపట్టే సభలో హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ మౌర్య, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, సంస్కృత వర్సిటీ ప్రతినిధి సాంబశివమూర్తి, ఆకెళ్ల విభీషణశర్మ పాల్గొంటారని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గౌరవ కార్యదర్శి సురేంద్ర నాయుడు తెలిపారు.

పురమిత్ర యాప్‌తో ఇంటివద్దే మున్సిపల్ సేవలు

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి - కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి, జూలై11 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పురమిత్ర యాప్ ద్వారా ఇంటి వద్దే సేవలు పొందవచ్చునని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఇంటినుంచే ఫిర్యాదులు ఇవ్వవచ్చునని వివరించారు. నగరంలోని తిరుమలరెడ్డినగర్ వార్డుల్లో శుక్రవారం ఇంటింటి సర్వేను కమిషనర్ అధికారులతో కలసి పరిశీలించారు. నగరవాసుల స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పేదరికంలో ఉన్న వారికి ప్రభుత్వం తగు సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. పురమిత్ర యాప్‌ను ప్రజలందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై11(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని డివిజన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ కాలనీ, రేణిగుంట రోడ్డు, దామినేడు పాత ఇళ్లు, మెటర్నిటీ ఆస్పత్రి, డాక్టర్స్ వసతి గృహాలు, స్విమ్స్, బర్డ్ ఆస్పత్రులు, మర్రి చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ కాలనీ, గాలివీధి, మంచాల వీధి, అనంత వీధి, త్యాగరాజ కాలనీ, సింగాలగుంట, వరదరాజనగర్, కొర్లగుంట, అశోక్‌నగర్, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, టీకే స్ట్రీట్, దొడ్డాపురం వీధి, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రనగర్, ద్వారకానగర్, సప్తగిరి నగర్, కేటీరోడ్డు, అలిపిరి రోడ్డు, మధురానగర్, తుడా రోడ్డు, రైల్వే కాలనీ, సుందరయ్యనగర్, వీవీమహల్ రోడ్డు, తాతయ్యగుంట, శ్రీనగర్‌కాలనీ, గాంధీపురం, తిరుమలనగర్, శ్రీదేవి కాంప్లెక్స్, నవాబుపేట, జబ్బార్ లేఅవుట్, నిమ్మకాయల వీధి, బండ్లవీధి, చిన్న, పెద్ద కాపువీధులు, శివజ్యోతినగర్, ఎస్టీవీ నగర్, వెంకటరెడ్డికాలనీ, కెనడి నగర్, క్రాంతి నగర్, అంబేడ్కర్ నగర్, బీటీఆర్ నగర్, సత్యనారాయణపురం, ఎల్ఎస్‌వీ నగర్, అరుణోదయ నగర్, మాధవనగర్, ఎర్రమిట్ట, తిమ్మినాయుడుపాళెం, వేదాంతపురం, కలిశం బిల్డింగ్, అవిలాల సమీప ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో నరసింహులు - శుభాకాంక్షలు చెబుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్ విభాగంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, ప్రొఫెసర్లు సాయిసుజాత, చంద్రశేఖరయ్య పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా వనరులు పెంపొందించుకోవాల్సి ఉందన్నారు. జనాభా దినోత్సవం సందర్భంగా ప్రతిభా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఉన్నత విద్యను దూరం చేసే జీవో 77ను రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (కలెక్టరేట్), జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని, పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నెంబరు 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పేద విద్యార్థుల కష్టాలు తీరుస్తానని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రెండు నెలల్లో విద్యార్థుల ఖాతాలో జమ చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఏడాది పూర్తయినా ప్రకటనలకే పరిమితమయ్యారే తప్పా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేసి, జీవో నెంబరు 77ను రద్దు చేయని పక్షంలో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, కోగిలి మునిచందు, హరికృష్ణ, మోహన్, వినయ్, వేణు, పులికొండ గణేష్, అశోక్, పవన్, సిద్ధు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్ (రూసా) పథకంపై శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. రూసా నిధులతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. భవిష్యత్తులోనూ రూసా నిధులతో యూనివర్సిటీలో సదుపాయాలను మెరుగుపరచడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ రామ్మోహన రావు మాట్లాడుతూ రూసా పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూసా కో-ఆర్డినేటర్ రమాశ్రీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల, జూలై11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, గుజరాత్ చీఫ్ సెక్రటరీ పంకజ్ కుమార్, తెలంగాణ జాయింట్ సెక్రటరీ కె శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వీరిలో ఉన్నారు.

యనమల రామకృష్ణుడు

రుయాస్పత్రికి కందారపు రాజమ్మ కళ్లు దానం

తిరుపతి(వైద్యం), జూలై 11(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తల్లి కందారపు రాజమ్మ(82) అనారోగ్యంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆమె కళ్లను రుయాస్పత్రి కంటి నిధికి దానం చేసేందుకు మురళి ముందుకొచ్చారు. ఈ విషయాన్ని ఆస్పత్రి కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి దృష్టికి తీసికెళ్లడంతో టెక్నీషియన్ రమేష్.. మృతురాలి కళ్లను సేకరించి కంటి నిధిలో భద్రపరిచారు. కంటి చూపులేని వారికి తన తల్లి కళ్లతో లోకంచూసే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చినట్లు మురళి తెలిపారు. రాజమ్మ కుటుంబీకులను రుయా సూపరింటెండెంట్ రాధ, వైద్యాధికారులు అభినందించారు.



తన తల్లి కళ్లను రుయాస్పత్రి కంటి నిధికి దానం చేస్తున్న కందారపు మురళి

సర్వ దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,473

తలనీలాలు సమర్పించినవారు: 27,796



విద్యా సంస్థల ప్రాంగణాల్లో 'పొగాకు' విక్రయాలపై కొరడా

- విస్తృతంగా పోలీసుల తనిఖీలు
- ఇప్పటికి 56 కేసులు నమోదు



పొగాకు ఉత్పత్తులు తీసుకోబోమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాసంస్థల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికి 56 కేసులు నమోదు చేశారు. విద్యాసంస్థలకు 200 మీటర్ల లోపు పొగాకు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి ఒక్కో దుకాణాదారుడికి రూ.200 అపరాధ రుసుం విధించారు. మళ్లీ విక్రయాలు జరిపితే నేరుగా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఇకపై అన్ని మాల్స్, షాపులు, దుకాణాలు, ఇతర వాణిజ్య, వర్తక దుకాణాల్లోనూ ముమ్మరంగా తనిఖీలు చేసి పొగాకు ఉత్పత్తులు విక్రయాలు చేస్తున్న వారిపై మరిన్ని కేసులు నమోదు చేస్తామని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం హెచ్చరించారు. దీనికి సంబంధించి ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని దుకాణాలను తనిఖీ చేసి ప్రతి రోజు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎస్వీఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'పై అవగాహన తరగతులు నిర్వహించారు. అంతకుముందు గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో అన్ని దుకాణాలు తనిఖీ చేసి పొగాకు ఉత్పత్తులు విక్రయించే వాటికి అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీతో పాటు సీఐలు శ్రీనివాసులు, మురళీమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

70 విద్యా సంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు

వారం రోజులుగా 70 విద్యాసంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా వాటిలోనూ ఏర్పాటు చేసే దిశగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎనిమిది.. ఆపై తరగతులకు సంబంధించిన అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ భక్తవత్సలం చెప్పారు. ఈ టీమ్‌లో ప్రధానోపాధ్యాయుడు, కళాశాల ప్రిన్సిపల్ నామినేట్ చేసిన ఇద్దరు సీనియర్ అధ్యాపకులు కో ఆర్డినేటర్లుగా ఉంటారు. వారిలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వారికి ప్రాధాన్యమిస్తారు. ఇద్దరు విద్యార్థులు, మరో ఇద్దరు విద్యార్థినులు ఉంటారు. వీరు ఆయా విద్యాసంస్థల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, వినియోగం, మత్తు పదార్థాలు, గంజాయి వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తారు. అంతే కాకుండా ప్రతి తరగతిలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటారు.



దుకాణాల వద్ద తనిఖీలు

భాకరాపేట ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



టమోటా లోడుతో బోల్తా పడిన వాహనం (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన మహబూబ్ బాషా

- ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న మినీ లారీ
- ఒకరి దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు

చంద్రగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టమోటా లోడ్‌తో వేగంగా వస్తున్న మినీ లారీ అదుపు తప్పి మోటారు సైకిల్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్ సమీపంలోని భాకరాపేట ఘాట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేట సమీపంలోని దీన్‌ధార్‌పల్లెకు మహబూబ్ బాషా(58).. చంద్రగిరి మండలం కాశిపెంట్ల వద్ద హెరిటేజ్ ఫ్యాక్టరీలో వర్క్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తన విధులు ముగించుకుని, స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కళ్యాణి డ్యామ్ సమీపానికి వచ్చే సరికి.. మదనపల్లె నుంచి టమోటా లోడ్డుతో అతివేగంగా వస్తున్న మినీలారీ ఈ ద్విచక్ర వాహనంపై దూసుకెళ్లి, రోడ్డు పక్కన కల్వర్టులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహబూబ్‌బాషా అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్లు గుడివాకు చెందిన ధర్మయ్య, హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్లు ధర్మయ్య, హుస్సేన్

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ట్రాన్స్‌కో ఏఈ సరెండర్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న చలపతి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో ఎస్‌ఈ కార్యాలయంలో సరెండర్ చేసినట్లు శ్రీకాళహస్తి ఏడీఈ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏఈ చలపతి 33కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహించి వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ ఇవ్వలేదని తెలిపారు. వినియోగదారుల సమస్యలపై స్పందించకపోవడం, విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం చోటు చేసుకున్నా పట్టించుకోకపోవడంతో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అధికం కావడంతో ఎస్‌ఈ సురేంద్ర నాయుడి ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి మండల ఏఈగా విధుల నుంచి తప్పించి ఎస్‌ఈ కార్యాలయంలో రిపోర్టు చేయవలసిందిగా ఆదేశాలు వచ్చినట్లు ఏడీఈ తెలిపారు.

అంగన్వాడీ పుస్తకాల ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీల్లో ఆటపాటలతో పాటు పుస్తకాల ద్వారా విజ్ఞానం పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ 3నుంచి 6 వ సంవత్సరం వరకు పిల్లలకు అందజేసే పుస్తకాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ వసంతాబాయి, అసిస్టెంట్ పీడీ వాసంతి తదితరులు పాల్గొన్నారు.



ఐఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్

- రోజుకు 20 టన్నులు ప్రాసెస్ చేసేలా యంత్రాల ఏర్పాటు
- రేపు రాష్ట్రమంత్రి భరత్‌తో కలిసి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్



రూ.3 కోట్లతో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సీఐసీ కేంద్రం

ఏర్పేడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్‌కు సంబంధించి ఏర్పాటైన కామన్ ఇంక్యుబేషన్ సెంటర్(సీఐసీ) ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌తో కలిసి కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆదివారం ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. భారత ప్రభుత్వం ఈ కేంద్రాన్ని రూ.3కోట్లతో ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద అభివృద్ధి చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 76 కేంద్రాల్లో తిరుపతిలో ఏర్పాటు అవుతున్న ఈ కేంద్రం ఒకటి. రూ.2,059 కోట్ల వ్యయంతో ఈకేంద్రాలను నిర్మిస్తున్నారు. ఈ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ రసాయనిక ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీఎం రాఘవరావు సమన్వయంతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మార్గదర్శనంలో అభివృద్ధి చేశారు. ఈ కేంద్రం ముఖ్యంగా పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ మీద దృష్టి సారించనుంది. ఒక రోజుకు 20 టన్నుల వరకు మామిడి, అంజీర్, జామ తదితర పండ్లను ప్రాసెస్ చేసి జ్యూస్, పల్ప్, జామ్, పికిల్స్ వంటివి తయారు చేస్తారు. ఈ కేంద్రం విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా కూడా ఉపయోగపడుతుంది. ఎంఎస్, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫుడ్ టెక్నాలజీలో ప్రాక్టికల్ శిక్షణ పొందడానికి మెరుగైన అవకాశం ఉంటుంది. ఈ సెంటర్‌లో తయారయ్యే ఉత్పత్తులు స్వస్థ అనే బ్రాండ్ ద్వారా మార్కెట్‌లోకి రానున్నాయి.



సీఐసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన యంత్రాలు

మఠం, కాలువ భూముల్లో నిర్మాణాలు

- అడ్డుకున్న అధికారులు
- ఆక్రమించి నిర్మిస్తే క్రిమినల్ కేసులు పెడతామన్న కలెక్టర్



నిర్మాణదారులతో మాట్లడుతున్న ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్



మఠంభూమిలో నిర్మాణాల తొలగింపు తర్వాత అధికారులతో మాట్లాడుతున్న నిర్మాణదారులు

తిరుపతిరూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం అవిలాల పంచాయతీ సర్వేనంబర్లు 145, 147లోని వివాదాస్పద మఠం భూముల్లో చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు అడ్డుకున్నారు. న్యాయస్థానంలో కేసు నడుస్తున్న (స్టేటస్ కో) ఈ భూముల్లో పరకాల మఠం ద్వారా పొందిన నరసింహారెడ్డి, అతడి మనుషులు నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో ఇటీవల హథీరాంజీమఠం అధికారులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో శుక్రవారం ఆర్డీవో రామ్మోహన్, ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి, డీఎస్పీ ప్రసాద్, రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్, రూరల్‌సీఐ చిన్నగోవిందు ఈ భూములను పరిశీలించారు. నిర్మాణాల తొలగింపునకు అధికారులు ప్రయత్నించగా నిర్మాణదారులు అడ్డుకున్నారు. 'సర్వేనంబరు 145, 147లో హథీరాంజీమఠం, పరకాల మఠానికి సంబంధించి వివాదం నడుస్తోంది. దీనిపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు' అంటూ నరసింహారెడ్డి, అతని తరపు వ్యక్తులను పిలిపించి మాట్లాడారు. కోర్టు ఉత్తర్వులు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మఠంభూమికి సమీపంలోని అవిలాల గ్రామానికి సంబంధించి సర్వేనంబరు 146లో వాగుపోరంబోకు స్థలంలో చేపడుతున్న నిర్మాణాలను రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్ అడ్డుకున్నారు. ఇది కాలువభూమి కాదని, సర్వేనంబరు 147కి సంబంధించిన మఠంభూమి అని సేతుమాధవ్, మరికొందరు అడ్డుకున్నారు. ఈ భూమిని సర్వేచేశామని, సర్వేనంబరు 146కి సంబంధించి కాలువభూమిగా నిర్ధారణ అయిందని తహసీల్దార్ వివరించారు. దీనిపై ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, ఎంతకూ స్పందించకపోవడంతో తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. సర్వేకోసం రెండువారాల గడువు కావాలని సేతుమాధవ్ కోరగా, వారం రోజుల్లో సర్వే ప్రక్రియని పూర్తిచేయాలని తహసీల్దార్ సూచించారు. కాగా సర్వేసమయంలో ప్రైవేట్ సర్వేయర్‌తోపాటు డిస్ట్రిక్ట్ సర్వేయర్‌ని కూడా పంపుతామని, కాలువభూమిగా నిర్ధారణ అయిన వెంటనే నిర్మాణాలు తొలగిస్తామని సూచించారు. ఎండోమెంట్‌భూములు, కాలువపోరంబోకు భూముల ఆక్రమణలపై ఆయా విభాగ అధికారులు స్పందించారు. ఈవివాదంపై కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. మఠంభూమి, ప్రభుత్వభూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హైకోర్టు స్టే విధించినా మఠంభూములను ఆక్రమించడం, నిర్మాణాలు చేపట్టడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపును అడ్డుకున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు, తొలగింపు సందర్భంగా రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఆరుగురిపై క్రిమినల్ కేసు నమోదైంది. తిరుపతి రూరల్ తహసీల్దారు బి.రామాంజులునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎంఆర్‌పల్లె పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అవిలాలలోని, లింగేశ్వరనగర్‌లో సర్వేనెంబరు 146లో శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో రెవెన్యూ, పోలీస్ బలగాలు కలసి అక్రమ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా దండు కామేశ్వరి, ఎస్.యశోద, సి.బాలాజీ, పి.సేతుమాధవ్, పి.మోహన్, ఐ.సాయిచరణ్ అధికారులను అడ్డుకున్నారు, దురుసుగా ప్రవర్తించారు, బెదిరింపులకు పాల్పడ్డారు. రెవెన్యూ శాఖ ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను బలవంతంగా నిలిపి వేయించారు. ప్రభుత్వ భూమిపై తమ అధికారం చూపుతూ, రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతో తహసీల్దారు ఎంఆర్‌పల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద ఈ ఆరుగురిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రౌడీయిజంతో కుటుంబాలు ఛిద్రం: డీఎస్పీ

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అనాలోచితంగా అత్యుత్సాహంతో రౌడీయిజానికి పాల్పడితే వారి కుటుంబాలన్నీ తీవ్రంగా నష్టపోతాయని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. ఇటీవల ప్రభుత్వాస్పత్రిలో రెండు వర్గాలు దాడులకు దిగిన ఘటన తెలిసిందే. దీనిపై రౌడీయిజాన్ని రూపుమాపాలన్న ధ్యేయంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సబ్‌డివిజన్ పోలీసు యంత్రాంగం అంతా పట్టణంలో గురువారం రాత్రి కవాతు నిర్వహించి దాడి ఘటనలో పాత్రధారులైన వారి ఇళ్ల వద్దకు చేరుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తిలో సరికొత్త ఆలోచనతో రౌడీయిజాన్ని తగ్గించాలని నిర్వహించిన పోలీసు కవాతుకు అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తమైంది. ముందుగా డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది సమావేశమయ్యారు. పట్టణ ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహిస్తూ 1వ వార్డు వరకు చేరుకున్నారు. ఇటీవల దాడిలో పాల్గొన్న వారి ఇళ్ల వద్దకువెళ్లి మైకుల ద్వారా రౌడీయిజానికి పాల్పడితే ఆయా కుటుంబంలో పిల్లలు, మహిళలకు సమాజంలో గౌరవం లోపిస్తుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నియామకానికి కూడా అవకాశం కోల్పోతారని తెలిపారు. రౌడీషీటర్‌గా నమోదైతే జరిగే నష్టాలను తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు సహకరించడం, మత్తు వ్యసనాలకు గురైతే ఎదురయ్యే అనర్థాలను వివరించారు. అక్కడి నుంచి పట్టణంలోని పలుప్రధాన వీధుల్లో కవాతుగా సాగుతూ మంచినీళ్ల గుంట ప్రాంతానికి చేరుకున్నారు. ఇక్కడ దాడి ఘటనలో ఉన్న వారి కుటుంబాలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు గోపి, తిమ్మయ్య, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

తిరుపతి(నేరవిభాగం),జూలై 11(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికీ శుక్రవారం పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో సత్యనారాయణ సీఐడీ నుంచి ఇంకా రిలీవ్ కాలేదు. అలాగే సి.మురళిని తిరుమల టూ టౌన్ నుంచి తిరుపతి వెస్ట్‌కు, షేక్ జిలానీ ఫీర్‌ను రేణిగుంటకు, టి.గోపాల్‌ను అలిపిరి పీఎస్‌కు, ఎన్. శ్రీనివాసులును తిరుచానూరు నుంచి ఆర్‌సీ పురానికి, ఎస్. వెంకటేశ్వర రావును క్రైం స్టేషన్ నుంచి ఎంఆర్‌పల్లెకి, ఈశ్వర సింగ్‌ను శ్రీకాళహస్తి టూ టౌన్ నుంచి ఏర్పేడుకు, టి.సుబ్రమ్మణ్యం రెడ్డికి ఇంటెలిజెన్సు నుంచి రిలీవ్ అయి వచ్చిన తర్వాత పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇక టి. పురుషోత్తమ ఆచ్చారిని క్రైం స్టేషన్ నుంచి చంద్రగిరికి, రాజగోపాల్ రెడ్డిని క్రైం స్టేషన్‌లో కోర్టు మానటరింగ్ విభాగం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పుత్తూరు వార్తలు

మానవ వనరుల సద్వినియోగంతో జనాభా పెరుగుదల సమస్య కాదు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటే జనాభా పెరుగుదల సమస్య కాదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యసేవలు, నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు చేపడితే జనాభా అభివృద్ధి సమస్య కాదని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు, వరలక్ష్మి, బాబూరావు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు సొంత భవన వసతి కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పుత్తూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని బీసీ హాస్టల్‌కు సొంత భవన వసతి కల్పించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించి, కలెక్టరుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పట్టణ సీపీఐ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ 16 ఏళ్లుగా అద్దె భవనాల్లో బీసీ హాస్టల్‌ను నిర్వహించడం వల్ల తరచూ భవన యజమానుల వత్తిడితో మరో భవనంలోకి తరలించాల్సి వస్తోందని వాపోయారు. ప్రస్తుతం కూడా భవన యజమానికి సక్రమంగా అద్దె చెల్లిస్తున్నా ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఈ నెలాఖరులోగా ఖాళీ చేయాలని వత్తిడి చేస్తున్నారని అన్నారు. దీంతో మరో భవనం వెతుక్కునే వెసులుబాటు లేక ఎక్కడికి వెళ్లాలో తెలియక విద్యార్థులు దిక్కుతోచక ఉన్నారని తెలిపారు. ఈ సమస్యలు విన్న కలెక్టర్ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దాము, ఉమేష్, వినయ్, మహేష్ పాల్గొన్నారు

హైవే అండర్ పాస్‌ల కోసం మంత్రికి వినతి



మంత్రిని సన్మానిస్తున్న ఎంపీటీసీ

పుత్తూరు అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో పరమేశ్వర మంగళం, మిద్దిగుంట, కైలాసపురం వద్ద హైవే అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి పరమేశ్వరమంగళం ఎంపీటీసీ శ్రీజా బాలాజీ నాయుడు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం రాయచోటిలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగానే ప్రజలు ఇబ్బందులు పడకుండా అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు స్పందించిన మంత్రి ఆర్డీవోకు ఫోన్ చేసి సదరు అండర్ పాస్ విషయాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీటీసీ వెంట ప్రవీణ్‌నాయుడు, జాకీర్ బాషా, అశోక్ చౌదరి తదితరులు ఉన్నారు.

ధర్మరాజ స్వామి తిరునాళ్లకు అంకురార్పణ

పుత్తూరు టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం తిరునాళ్లకు అంకురార్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్యకైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ పండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

భారతీయ వైద్యంలో హోమియోకు ప్రత్యేకస్థానం



మాట్లాడుతున్న ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు

పుత్తూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): భారతీయ వైద్యంలో హోమియోకు ప్రత్యేక స్థానం ఉందని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు అన్నారు. పుత్తూరు పట్టణంలోని కేకేసీ హోమియో మెడికల్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రాచీన వైద్యమైన హోమియోలో చాలా రోగాలకు అద్భుతమైన చికిత్స ఫలితాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల ఛైర్మన్ కుప్పయ్యశెట్టి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఈ ఏడాది వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు వచ్చాయని చెప్పారు. జాతీయ స్థాయిలో ఇద్దరు విద్యార్థులు రీసెర్చ్ స్కాలర్‌షిప్‌ను పొందారని అన్నారు. ఈ సంబరాల్లో తెలుగు సినీనటి ప్రగ్యానయన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రీడా బహుమతులను ప్రిన్సిపాల్, సినీనటి ఇద్దరు విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్లు నరసింహారావు, రవిశేఖర్, ప్రిన్సిపాల్ శరవణన్, కేకేసీ గ్రూపు సంస్థల అడ్వయిజర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

అప్పలాయగుంటలో వైభవంగా అంకురార్పణ



అప్పలాయగుంటలో మేదినీదేవిని తీసుకెళుతున్న అర్చకులు

వడమాలపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించే శ్రీవారి పుష్పయాగం సందర్భంగా శుక్రవారం అంకుర్పారణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు ఆధ్వర్యంలో పుట్ట మట్టిని మేదినీదేవి రూపంలో అలంకరింపజేసి, మంగళహారతులిచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహా గోపురం వద్ద వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ గావించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్‌రాజు, అర్చక బృందం, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పుత్తూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ తీగెల మీద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జయసాయి తెలిపారు. అంతరాయం వల్ల కలిగే అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్‌వాసి మృతి



మృతి చెందిన పాశ్వాన్

నాయుడుపేట టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్‌వాసి పాశ్వాన్(27) మృతి చెందినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పాశ్వాన్ కొంత కాలంగా మేనకూరు పారిశ్రామికవాడలోని ఓ కర్మాగారంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన గదిలో ఇనుప కొక్కికి దుస్తులు తగిలిస్తుండగా విద్యుదాఘాతం జరగడంతో పాశ్వాన్ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. అతని సోదరుడు రోహిత్ హుటాహుటిన మేనకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే పాశ్వాన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







మధురెడ్డి గిరిజనకాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు - నిరుపయోగంగా ఉన్న చేతిబోరు - దుస్థితిలో పక్కా గృహాలు

గిరిజన కాలనీలో మౌలిక వసతులేవీ?

గూడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న మధురెడ్డి గిరిజనకాలనీలో మౌలిక వసతులు లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గూడూరు నుంచి వేములపాళెం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కాలనీలో 43 కుటుంబాలు ఉన్నాయి. కాలనీలో ఉన్న రెండు వీధులు మట్టి రోడ్లే. గతంలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన పక్కా గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో ఇళ్లు ఉరుస్తుండడంతో పాటు వీధులు బురదమయంగా మారుతుండడంతో నానాపాట్లు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కాలనీలోని రెండు చేతి బోర్లలో ఉప్పునీళ్లు వస్తున్నాయని, కొళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగితే దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో మౌలిక వసతులను మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం: విజయశ్రీ



భూపయ్యకాలనీలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని భూపయ్య కాలనీ, బీడీకాలనీ, లోతువానిగుంట, పొగగొట్టంకాలనీ, పాత శివాలయంవీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీ ప్రతి ఇంటికీ వెళ్లి ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ముందుగా భూపయ్య కాలనీవాసులు కాలనీకి దారిని ఏర్పాటు చేయాలని, కొంతమందికి ఇళ్ల మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పరుస్తున్నారని అన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ అమలు చేశారని త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకాలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, గృహనిర్మాణశాఖ ఏఈ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రఫీ, సుబ్బారావు, చిగురువాడ అశోక్‌కుమార్, ధనంజయ, నిత్యకృష్ణారెడ్డి, కట్టంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, జయరామయ్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: పాశం



తిప్పవరపాడులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పవరపాడు, కందలి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తూ ప్రజల మన్ననలను పొందుతోందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ.4వేలు చేసి ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందజేయడం జరిగిందన్నారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి రూ.5కే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పేదల ఆకలిని తీరుస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితబస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. అనంతరం తిప్పవరపాడు గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, దామోదర్, అమరేంద్ర, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వాచ్‌మ్యాన్ మృతి

ఓజిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాజుపాళెం గిరిజన కాలనీకి చెందిన మేకల మస్తానయ్య(50) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన సమాచారం మేరకు... మస్తానయ్య రాజుపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు సంస్థలో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన మస్తానయ్యను నెల్లూరులోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేగేటు ఉన్న చోటే అండర్ బ్రిడ్జి

సూళ్లూరుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ప్రస్తుతం రైల్వేగేటు ఉన్న చోటే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని రైల్వే డివిజనల్ ఇంజినీర్ వికాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అండర్ బ్రిడ్జి నిర్మాణంపై రైల్వే అధికారులు పట్టణవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు అండర్ బ్రిడ్జి గుండా అంబులెన్స్‌లు, ఆటోలు, మోటారు బైకులు వెళ్లేలా నిర్మాణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రనాథ్ రెడ్డి, ఏడీఎం మోహన్, మురారికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రామకృష్ణ



బాలాయపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవో స్థానం ఖాళీగా ఉండడంతో కయ్యూరు పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు డిప్యూటీ ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ పదోన్నతిపై బాలాయపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు.

నగల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



నాయుడుపేట టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ లీగల్ మెట్రాలజీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దర్గా రోడ్డులోని ఓ దుకాణంలో తూకాలు, రికార్డులు, జీఎస్టీ బిల్లులు, బంగారు నిల్వలు, తదితర రికార్డులను విజిలెన్స్ అధికారులు తీసుకువెళ్లారు. ఏమైనా తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం

చిల్లకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వల్లిపేడు గ్రామంలోని వల్లిపేటయ్య దేవస్థానం ప్రాంగణంలో సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సీతారాముల శాంతి కల్యాణమహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో జిల్లా అర్చక కళామండలి సభ్యులు దీవి అనంతాచార్యులు వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యహవాచనం, రక్షిబంధనం, కన్యాదానం, మాంగళ్యధారణ, మాలమార్పిడి, తలంబ్రాల విశిష్ఠతను వివరిస్తూ కళ్యాణం జరిపించారు. లేబూరు సాయి బృందం నాదస్వర కచేరి, విద్వాన్ వరద వెంకటసుబ్రహ్మణ్యం అన్నయమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో పీవీఎస్ నారాయణరావు, ముచ్చకాల నందకుమార్, సుర్తాని, మధుసూదన్, మహిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పాలకేంద్ర వద్ద 132కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెంకటగిరి విద్యుత్ శాఖ డీఈఈ మునిరవిచంద్ర శుక్రవారం తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాయుడుపేట: పట్టణంలోని అగ్రహారపేట, పిచ్చిరెడ్డితోపు, అమరా గార్డెన్, చంద్రమౌళినగర్, విజయగణపతి ఆలయం ప్రాంతం, టీచర్స్ కాలనీ, బాలాజీ గార్డెన్, గాంధీమందిరం, జైహింద్ కాలనీ, పొగగొట్టం కాలనీ, గరిడీవీధి, భూపయ్యకాలనీ, ఆవనీహోమ్, రాజగోపాలపురం, శ్రీరామ్‌నగర్, అశోక్‌నగర్, జువ్వలపాళెం, విన్నమాల తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివశంకర్ తెలిపారు.

తడ: సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు సరఫరా మండలంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మురళి తెలిపారు.

కోట: మండలంలోని చెందోడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కోట, వాకాడు మండలాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడీఏ చిన్నయ్య తెలిపారు.

14 నుంచి ఎమ్మెల్యే పర్యటన

చిట్టమూరు, జులై 11(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈనెల 14 నుంచి 18 వరకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు తెలిపారు. 14న మెట్టు, ఉప్పలమర్తి, 15న మొలకలపూడి, చిల్లమూరు, 16న ఆరూరు, ఎల్లూరు, 17న పల్లంపర్తి, ముక్కిడిపాళెం, 18న అరవపాళెం, బురదగాలి కొత్తపాళెం గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, పక్కన ఈగల్ క్లబ్ నిర్వాహకుడు సుబ్రహ్మణ్యం తదితరులు

సూళ్లూరుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. శుక్రవారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

డక్కిలి, జులై 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శివశంకర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన డక్కిలి - రాపూరు మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, రెండోసారి పట్టుబడితే లైసెన్సు రద్దు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. హెల్మెట్ లేకపోయినా కేసులు పెడతామన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్యామసుందరపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మంగళ, గురువారాల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలోని గుమ్మిడిపూడి కవర్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ, పట్టాల మార్పిడి వంటి పనులు జరుగుతునందున మంగళవారం(15వ తేదీ), గురువారం(17వ తేదీ) పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దు చేసిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 7.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66035.
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20గంటలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66036
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40, 8.35, 10.15, మధ్యాహ్నం 12.10కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 10.00, 11.45, మధ్యాహ్నం 12.35, 1.15కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8.05, 9.00, 9.30, 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 9.10, 9.55, 10.55, 11.25, మధ్యాహ్నం 12.00, 1.00, 2.30 వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- ఆవడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 4.25కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లను రద్దు చేశారు.

అలాగే చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబ్రం మధ్య నడిచే ఈఎంయూ లోకల్ రైళ్లు పాక్షికంగా రద్దు కాగా, మరి కొన్ని రైళ్లు చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరి, మీజూరు వరకు నడపనున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: కురుగొండ్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వార్డులో సమస్యలన్నింటినీ విడతల వారీగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 14వ వార్డు బొగ్గుల మిట్ట ప్రాంతంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వార్డు ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. వార్డులో తాగునీరు, డ్రైనేజ్ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన సమస్యలన్నింటినీ విడతల వారీగా పరిష్కరిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, రాష్ట్ర పద్మశాలీయుల కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, బీరం రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, మంకు ఆనంద్, పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, రవి, చొప్పా వెంకటరమణ, మేరిగ రామకృష్ణ, తాండవ చంద్రారెడ్డి, గల్లా శ్రీనివాసులు, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు

కోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తిరుమూరు మురళి ఆధ్వర్యంలో కొత్తపట్నంలోని దళిత, గిరిజనవాడల్లో ఇంటింటా తిరిగి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుక్, జనసేన నాయకులు కావలి అశోక్, టీడీపీ నాయకులు శీనయ్య, చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి

నాయుడుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ జేఎల్‌ఎం జీఆర్-2 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాయుడుపేట విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం ఈఈ శ్రీనివాసరావుకు ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎనర్జీ అసిస్టెంట్ల సంఘం నాయకుడు అశోక్‌రాజ్ మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్లకు నూతన సర్వీస్ రూల్స్ రద్దుచేసి ఏపీఎస్‌ఈబీ రూల్ ప్రకారం ఏఎల్ఎంగా ప్రమోషన్ ఇచ్చి బదిలీలు కల్పించాలని కోరారు.సురేష్, రామస్వామి, గురవయ్య, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా నగరోత్సవం

నాయుడుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారపేటలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ వేడుకలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి సాయిబాబాకు నగరోత్సవం నిర్వహించారు. బాబాను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పట్టణ పురవీధుల్లో మంగళ, వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూనాటి తిరుమల నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, పసుపులేటి రాజాబాబు, శ్రీధర్, చంద్రశేఖర్ రాయల్, ముత్యాలురెడ్డి, రామచంద్రారెడ్డి, మురళీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుబాబు, సిద్ధయ్య, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పీ4 సర్వేతో పేదరిక నిర్మూలన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీ4 సర్వేతో పేదరిక నిర్మూలన జరుగుతుందని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులతో పీ4 సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం పీ4 సర్వేతో కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. మండలంలో పీ4 సర్వే విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఎంఈవో -2 మునిసుబ్రమణ్యం, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక గోడపత్రికల ఆవిష్కరణ



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఈ నెల 20న ఆడికృత్తిక జరుగనుంది. దీనికి సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, హరియాదవ్, లక్ష్మయ్య, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గ్రూపు రాజకీయాలకు తావులేకుండా అభివృద్ధిపై దృష్టిపెడదాం

● సత్యవేడు టీడీపీ నేత శంకర్‌రెడ్డి



అంజూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు

కేవీబీపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రూపు రాజకీయాలకు తావులేకుండా నియోజకవర్గాన్ని అందరం కలిసి అభివృద్ధి వైపు నడిపిద్దామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని అంజూరు గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏ పంచాయతీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కారం చేయిస్తానని తెలిపారు. మండలంలో నాయకులందరూ విభేదాలు విడనాడి కలిసి పనిచేస్తేనే పార్టీ అభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. అనంతరం కూటమి ప్రభుత్వం సంవత్సరకాలంలో సాధించిన సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో 2019లో నాయకుల తప్పిదాల వల్ల ఓటమి పాలయ్యామని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అందరం కలిసి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజుల నాయుడు, నాయకులు మునస్వామియాదవ్, గోపీనాథరెడ్డి, పిచ్చాటూరు మండల నాయకులు తిరుమలరెడ్డి, పద్మనాభరాజు, యుగంధర్‌రెడ్డి, సతీష్‌నాయుడు, రాజారెడ్డి, మహిళా అధ్యక్షురాలు పావని, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తుడా నిధులతో రేణిగుంట అభివృద్ధి: ఎమ్మెల్యే



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తుడా నిధులతో రేణిగుంట అభివృద్ధికి కృషి చేస్తానని ఎ మ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నా రు. శుక్రవారం సాయంత్రం జ్యోతినగర్ లో 17, 18 వార్డుల అన్న నమస్తే యూనిట్ ఇన్‌చార్జులు మేరీ, చైతన్య అప్పు, బాబు ఆధ్వర్యంలో చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఒక సంవత్సరంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో సంప్రదించి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే మంగళవారం నుండి పట్టణంలో ప్రతి ఇంటికి గ్రీన్ అంబాసిడర్ వచ్చి పొడి, తడి చెత్తను సేకరిస్తారని, ఇందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, నాయకులు మునిస్వామి నాయుడు, మురళి, నవాబ్, కన్నన్‌రెడ్డి, రవి, ఎంజిరెడ్డి, సుబ్రహ్మణ్యం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే ఆదిమూలం



ఎంపీడీవోలతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. శుక్రవారం పిచ్చాటూరు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ఎంపీడీవోలతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ రోడ్లు, తాగునీరు, శ్మశానాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవోలకు దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఇస్తే నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. సమావేశంలో పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, కేవీబీపురం, సత్యవేడు మండలాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా పదోన్నతులపై మండలానికి విచ్చేసిన ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని మండల ఎస్టీయూ అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి సమిటి వెంకటేశులు, ఎంఈవోలు రవీంద్రనాథ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమవంతు బాధ్యతగా పనిచేస్తున్నామని తెలిపారు. ఎస్టీయూ నాయకులు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, చైతన్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

వరదయ్యపాళెం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డి కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల, మరుగుదొడ్ల నిరాణాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తిరిగి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసరాజు, సురేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నందనం శంకర్, హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బెల్టుషాపు నడుపుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న 26 మద్యం సీసాలను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ గోపి కథనం మేరకు.. పట్టణంలోని పాత సాయిరాం థియేటర్ వీధి వద్ద రాంబాబు అనే వ్యక్తి కూల్‌డ్రింక్ దుకాణం నడుపుతున్నాడు. అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారంతో దాడి చేశారు. ఈ సందర్భంగా 26మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, రాంబాబును అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



నిందితుడితో సహా పోలీసులు స్వాధీనం చేసుకున్నమద్యం సీసాలు

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని పలువురు ఐఏఎస్ అధికారులు శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. కేంద్ర ఫైనాన్షియల్ కార్యదర్శి నాగరాజు, ఇండియన్‌బ్యాంకు సీఈవో బినోద్‌కుమార్, గుజరాత్ చీఫ్ సెక్రటరీ పంకజ్‌జోషి, కేంద్ర హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ కార్యదర్శి శ్రీనివాస్ ఆర్కే, ఛత్తీస్‌ఘడ్ ఐఏఎస్ అధికారి కేదార్ కాశ్యప్, ఏపీ ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ మోహన్, జమ్మలమడుగు ఆర్డీవోసాయిశ్రీ స్వామి అమ్మవార్లను వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

బండి సంజయ్‌కు ముక్కంటి ప్రసాదాలు



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తిరుపతిలోని ఒక హోటల్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి భద్రతలను పరిరక్షించండి

● ఎస్పీని కోరిన ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శుక్రవారం ఉదయం తిరుపతిలో ఎస్పీ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ఈ మేరకు ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు ఎస్పీకు ఎమ్మెల్యే శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. తన వినతులకు ఎస్పీ సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే వెల్లడించారు.

జడ్పీ మాజీ వైస్ చైర్మన్‌కు పితృ వియోగం

రేణిగుంట జూలై 11 (ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ వైస్ చైర్మన్ అవిలాల రాజశేఖర్‌రెడ్డి తండ్రి వెంకట్రామారెడ్డి శుక్రవారం మృతి చెందారు. గాజులమండ్యం గ్రామానికి చెందిన వెంకట్రామారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. తిరుపతిలోనిఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. దీంతో పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

శాకాంబరిగా కన్యకాపరమేశ్వరి



శ్రీకాళహస్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆషాడమాసం పురస్కరించుకుని శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాకంబరిగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, 11 కేవీ లైన్ల నెలవారీ మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడు కండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● **సత్యవేడు:** సత్యవేడు సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిర్వహణ చేపట్టడం వల్ల పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.11ఎస్‌కేటీ19) రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠినచర్యలు

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్షణికావేశంతో నేరాలకు పాల్పడితే తీవ్ర శిక్షలు అనుభవించాల్సి వస్తుందని మందలించారు. రౌడీషీటర్లపై నిరంతరం పోలీసు నిఘా వెంటాడుతుందని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుని జీవనం సాగించాలని హితవు పలికారు.

ప్రణాళికాబద్ధమైన మాతృత్వంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

సత్యవేడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన మాతృత్వంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ క్రిస్టల్ దాస్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ● స్థానిక ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలలో జనాభా దినోత్సవంపై విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ హర్షవర్ధన్, ఎంపీహెచ్‌ఈవో సుబ్రమణ్యం, ఎంఎల్ హెచ్‌పీ సౌమ్య ఆశా, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ● **వరదయ్యపాళెం:** వరదయ్యపాళెం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ద్వైత ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నర్సు శాంతి, సీహెచ్‌వో కృష్ణంరాజు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు. ● **బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని పుత్తేరిలో వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తతో ఆదాయం సమకూర్చాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరు చేసి, దాని ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలోని నెలవాయి పంచాయతీలో సంపద కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంటి దగ్గర చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని తెలిపారు. ఇంటి పరిసరాలను, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏపీఎం మునెయ్య, ఏపీవో దేవరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు ఉద్యోగ భవిత

● ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే యువతకు ఉద్యోగ భవిత అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణంలో శుక్రవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనగా, ఉద్యోగాల కోసం 206మంది యువత హాజరు కాగా, 128మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. వీరిలో 16మంది షార్ట్ లిస్టు అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ కల్పన కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.12వేలు నుంచి రూ.20వేలు వరకు వేతన సదుపాయం అందజేస్తారన్నారు. ఎంపికకాని వారికి త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో స్కిట్ కళాశాల ప్రారంభం అవుతుందని, అందులో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 90 రోజులకు ఒకసారి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీవో లోకనాథం, ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జల బృందమ్మకు పలువురి శుభాకాంక్షలు



బృందమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ జన్మదిన వేడుకలు శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలో ఘనంగా జరిగాయి. పలువురు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ఆమె చేత కేక్ కట్ చేయించారు. అనంతరం పేదలకు అన్నదానం చేయించారు. పట్టణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బొజ్జల రిషితారెడ్డి, నాయకులు కంఠా రమేష్, కాసరం రమేష్, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల లక్ష్యం అధిగమించాలి

● పంచాయతీ సెక్రటరీలకు డీపీవో ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో సుశీలాదేవి

సత్యవేడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించాలని పంచాయతీ సెక్రటరీలను డీపీవో (జిల్లా పంచాయతీ అధికారి) సుశీలాదేవి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాయంలో ఎంపీడీవో త్రివిక్రమ రావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పన్నులు సకాలంలో వసూలు చేయకుంటే పంచాయతీల నిర్వహణ కష్టతరమవుతోందన్నారు. నిరుపేదలపై అధిక భారం పడకుండా పన్నులు పెంచాలన్నారు. కార్యదర్శులు ప్రతీ ఇంటి విస్తీర్ణాన్ని కచ్చితంగా కొలతలు తీసి పన్నులు నిర్ణయించాలన్నారు. పారిశుధ్యం విషయంలో సత్యవేడు మండలం వెనుబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను పారిశుధ్య నిర్వహణకు, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో సెక్రటరీలు పాల్గొన్నారు. ● **నాగలాపురం (ఆంధ్రజ్యోతి):** పంచాయతీల్లో ఉన్న వనరులను ఉయోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని డీపీవో సుశీలాదేవి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను, ఆస్తి పన్ను, వాణిజ్య పన్నులను సకాలంలో వసూలు చేయాలన్నారు. పారిశుధ్య చర్యలపై పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలనుచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, సర్పంచ్ సుధ, జూనియర్ అసిస్టెంట్ కలన్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన: టీడీపీ

నాగలాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధ్వంస పాలన నుంచి సుపరిపాలన వైపుకు తొలి అడుగు పడిందని టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మండలంలోని టీపీపాళెం, గోళ్ళవారి కండ్రిగ గ్రామాలలో శుక్రవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరప త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాచేంద్ర నాయుడు, సెల్వకుమార్, ప్రసాద్‌రాజు, చాన్‌బాష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ● **సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కుమ్మరిగుంట, పాపానాయుడు వీధి, దేవాంగపురం, అల్లాస్వామి వీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు చికెన్ చిన్న, దిలీప్, శంకరయ్య, దయ, మణి, జగన్, జనార్థన్, బాబి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణ అభివృద్ధే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం పురపాలకసంఘ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. డ్రైనేజీ, వీధిదీపాల వ్యవస్థను ప్రక్షాళన చేయడంపై ఆరా తీశారు. వివిధ అభివృద్ధి పనులపురోగతిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన యోగా ఛాంపియన్ మాన్యశ్రీ



మొక్క నాటుతున్న రాష్ట్ర యోగా ఛాంపియన్ మాన్యశ్రీ

పిచ్చాటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణంలోని అరణియార్ యోగా శిక్షణ కేంద్రం ఆవరణలో శుక్రవారం రాష్ట్ర యోగా ఛాంపియన్ మాన్యశ్రీ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానికులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ చిన్నారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి, వాటి సంరక్షణ బాధ్యత తల్లికి అప్పగించాలని కోరారు. చెట్లను మనం కాపాడితే మనకు అవి ప్రాణాన్ని ప్రసాదిస్తాయని వివరించారు.

లక్ష్మీహయగ్రీవస్వామికి శ్రవణ నక్షత్ర అభిషేకం

ఏర్పేడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మల్రిమందలో వెలిసిన లక్ష్మీహయగ్రీవస్వామికి శుక్రవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. పలు రకాల అభిషేకాలు నిర్వహించి, విశేష పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలో సామూహిక అక్షరాభ్యాసం జరిగింది. మధ్యాహ్నం ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన



ప్రజలకు ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న రావిళ్లమునిరాజా నాయుడు

శ్రీకాళహస్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ తొట్టంబేడు మండలాధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు అన్నారు. మండలంలోని చిట్టత్తూరు హరిజనవాడ, అరుంధతివాడ, లక్ష్మీపురం, గణపతికాలనీ గ్రామాల్లో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు వెంకటాచలం, మునిరత్నం, బాలాజీరెడ్డి, ప్రతాప్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమఫలాలు అందించడమే ధ్యేయం: టీడీపీ

ఏర్పేడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మడలం పంగూరు పంచాయతీలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసిఆయన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు పొన్నారావు, చంద్రశేఖర్‌నాయుడు, రాఘవేంద్రరావు, జగదీష్‌నాయుడు, నాగేశ్వరరావు, కృష్ణయ్యయాదవ్, నరసింహులునాయుడు, పెంచల్‌నాయుడు, వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలపై ప్రెస్, పోలీసు స్టిక్కర్లు అంటిస్తే చర్యలు తప్పవు

పిచ్చాటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు, ఫోర్ వీలర్లపైన యువతీ, యువకులు ఇష్టానుసారంగా ప్రెస్, పోలీసు స్టిక్కర్లు అంటించుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎవరికి ప్రెస్ అక్రిడిటేషన్ కార్డు ఉంటుందో వారు మాత్రమే తమ సొంత వాహనాలకి స్టిక్కర్లు వేసుకోవచ్చని చెప్పారు. స్థానికంగా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు మాత్రమే పోలీసు స్టిక్కర్ వేసుకోవచ్చునని, అలా కాకుండా సంబంధిత వ్యక్తులకు, బంధువులు, స్నేహితులు శ్రేయోభిలాషులు స్టిక్కర్లు అంటించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.